డీఆర్సీని సందర్శించిన కలెక్టర్



వివరాలను అడిగి తెలుసుకుంటున్న హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

నాంపల్లి: నియోజకవర్గం డీఆర్సీని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం సందర్శించారు. 30న జరిగే పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. 63-నాంపల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి లావణ్యను ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. బుధవారం సాయంత్రం 5 గంటల నుంచి నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలకు ఈవీఎం మిషన్లను 74 ఆర్టీసీ బస్సుల ద్వారా పోలింగ్ కేంద్రాలకు తరలించారు. నియోజకవర్గంలో మొత్తం 106 భవనాల్లో 285 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తును నియమించారు. మొత్తం 3,32,633 ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,71,207, మహిళలు 1,61,416, థర్డ్‌జెండర్ 10 మంది ఉన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో గురువారం ఉదయం 5 గంటలకే మాక్ పోలింగ్ నిర్వహిస్తారు. అనంతరం 7గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- పోలింగ్ స్టేషన్ల వద్ద భారీ బందోబస్తు
- ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు



ఎన్నికల ఏర్పాట్లలో గోషామహల్ రిటర్నింగ్ అధికారి విక్టర్



చార్మినార్‌లో పోలింగ్‌కు సిద్ధమైన పోలింగ్ స్టేషన్

అబిడ్స్: ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. గోషామహల్ నియోజకవర్గంలోని 235 పోలింగ్‌స్టేషన్లలో పోలింగ్ నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు దాదాపు ఏర్పాట్లు పూర్తిచేశారు. డీఆర్సీ కేంద్రం నుంచి అన్ని పోలింగ్‌స్టేషన్లకు ఈవీఎంలను, పోలింగ్ సిబ్బందిని తరలించారు. గోషామహల్‌లోని 2,70,623 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎన్నికల అధికారులు ఏర్పాట్లు చేశారు.

పోలింగ్‌కు భారీ ఏర్పాట్లు: ఆర్ఓ విక్టర్...

గోషామహల్ నియోజకవర్గంలో పోలింగ్ విజయవంతంగా జరిగేందుకు సకల ఏర్పాట్లు చేశామని నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి వి.విక్టర్ తెలిపారు. దాదాపు 2 వేల మందిని సిబ్బంది పోలింగ్ కోసం ఏర్పాటు చేశామన్నారు. 235 పోలింగ్‌స్టేషన్లలో గురువారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమవుతుందని విక్టర్ తెలిపారు. సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందన్నారు.

పోలింగ్‌స్టేషన్ల వద్ద భారీ బందోబస్తు..

గోషామహల్‌లో అన్ని పోలింగ్‌స్టేషన్ల వద్ద భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు పోలీస్ నోడల్ ఆఫీసర్, ఏసీపీ కోట్ల వెంకట్‌రెడ్డి తెలిపారు. ప్రజలు ఓటు హక్కును వినియోగించుకునే విధంగా పోలీస్ శాఖ పూర్తి బందోబస్తు చేపడుతుందన్నారు. అన్ని పోలింగ్‌స్టేషన్ల పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

పాతబస్తీలో..



పోలింగ్ స్టేషన్లకు ఈవీఎంలతో వెళ్తున్న సిబ్బంది

చార్మినార్: ఎన్నికల పోలింగ్‌కు పాతబస్తీ సర్వం సిద్ధమయ్యింది. చార్మినార్ నియోజకవర్గంతో పాటు యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట, బహదూర్‌పురాలలో ఎన్నికల పోలింగ్ సజావుగా జరగడానికి సంబంధిత అధికారులు అన్ని చర్యలు తీసుకున్నారు. పోలింగ్ సందర్భంగా ఎక్కడ ఎలాంటి అవాంచనీయ ఘటనలకు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల వద్ద తగిన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఓటరు లిస్ట్‌లో పేరున్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా తగిన ఏర్పాట్లు చేశారు. ఏవైనా ఇబ్బందులు కలిగితే ఎలక్షన్ కమిషన్ అధికారులతో పాటు సంబంధిత పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరుతున్నారు.

పోలింగ్‌కు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు..

పాతబస్తీలో పోలింగ్ ప్రశాంతంగా జరగడానికి దక్షిణ మండలం పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. అక్కడక్కడా మిగిలిపోయిన పార్టీ జెండాలను, బ్యానర్లను సంబంధిత సిబ్బంది తొలగించారు. పాతబస్తీలోని అన్ని కీలకమైన ప్రాంతాల్లో విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఇప్పటికే పాతబస్తీలో అదనపు బలగాలను మోహరించారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం లేకుండా పోలింగ్ కేంద్రాల వద్ద నిఘాను ముమ్మరం చేశారు. బుధవారం నగర పోలీసు కమిషనర్ సందీప్ శాండిల్య పాతబస్తీలో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. దక్షిణ మండలం డీసీపీ పోతురాజు సాయి చైతన్యతో కలిసి కీలకమైన అన్ని ప్రాంతాల్లో పర్యటించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా డీసీపీ సాయి చైతన్య మాట్లాడుతూ.. పోలింగ్ సందర్భంగా ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు 144 సెక్షన్ కొనసాగుతుందని ఇప్పటికే నగర పోలీసు కమిషనర్ వెల్లడించారన్నారు. పోలింగ్ స్టేషన్‌కు 200 మీటర్ల పరిధిలో ఎక్కువ సంఖ్యలో గుమిగూడడానికి అవకాశం లేదన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తును మరింత పెంచినట్లు ఆయన తెలిపారు. ఎస్ఐ, సీఐ స్థాయి అధికారులు మొబైల్ వ్యాన్లలో తిరుగుతూ పరిస్థితిని అంచనా వేస్తారన్నారు. ఎక్కడ ఎవరికైనా ఎలాంటి సమస్య తలెత్తినా వెంటనే 100తో పాటు దక్షిణ మండలం డీసీపీ 87126 60301లో సంప్రదించాలన్నారు.

ఘనంగా కార్తీకమాస వన భోజనాలు



మాట్లాడుతున్న ప్రాజెక్టు కన్వీనర్ మాడిశెట్టి సదానందం గుప్తా

జియాగూడ: ప్రతి యేటా ఆర్యవైశ్య సంఘం పురానాపూల్ కార్వాన్ ఆధ్వర్యంలో కార్తీకమాస వన భోజనాలను ఘనంగా నిర్వహిస్తామని ప్రాజెక్టు కన్వీనర్ మాడిశెట్టి సదానందం గుప్తా, ప్రాజెక్టు చైర్మన్ యాద శ్రీనివాస్‌గుప్తా అన్నారు. బుధవారం పెంజర్ల అనంత పద్మనాభ స్వామి ఆలయ ఆవరణలో ఆర్యవైశ్య సంఘం పురానాపూల్ కార్వాన్ ద్వారా కార్తీ వనభోజన కార్యక్రమం ఏర్పాటైంది. సదానందంగుప్తా మాట్లాడుతూ.. కార్తీకమాసంలో వనభోజనాల వల్ల సంఘం సంఘటితమవుతుందని పేర్కొన్నారు. సురేష్‌గుప్తా, జగిని యాదగిరి గుప్తా, గోవింద్‌గుప్తా, అనితరెడ్డి, రమేష్, ధనుంజయ, కొండ రమేష్ పాల్గొన్నారు.

గోల్కొండ కోటకు పర్యాటక శోభ

గోల్కొండ: గోల్కొండ కోటకు పర్యాటకులు పోటెత్తారు. సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి కోట సందర్శనానికి భారీగా పర్యాటకులు తరలివచ్చారు. ఉదయం 8 గంటల నుంచే కోట బుకింగ్ కౌంటర్ ముందు పర్యాటకులు భారీగా బారులు తీరారు. మధ్యాహ్నం కోటలోని నగీనాబాగ్ పర్యాటకులతో నిండిపోయింది. క్లాపింగ్ ప్లోటికో వద్ద విదేశీ పర్యాటకులు చిన్నారులు చప్పట్లు కొడుతూ సందడి చేశారు. కోటలోని రాణిమహల్ ప్రాంగణం వద్ద గ్రీన్స్ లాన్స్‌లో కోటను సందర్శించి అలసిపోయిన పర్యాటకులు పచ్చికపై సేదతీరారు.



భాగ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

చార్మినార్: చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయాన్ని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి బుధవారం సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ శశికళ ఆలయ మర్యాదలతో ఆయనకు ఘనంగా స్వాగతం పలికి శాలువా కప్పి సత్కరించారు.



నాటక రంగాన్ని కాపాడుకుందాం: మామిడి హరికృష్ణ

గన్‌ఫౌండ్రీ: ప్రస్తుత సమాజంలో అంతరించిపోతున్న నాటక రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతగానో ఉందని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న సురభి నాటకోత్సవాలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్త ప్రహ్లాద, మాయాబజార్ నాటకాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

ఎయిడ్స్ పాజిటివ్ వారికి కౌన్సెలింగ్

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో ఎయిడ్స్ పాజిటివ్ ఉన్న వారికి కౌన్సెలింగ్ నిర్వహించడంతో పాటు వారికి ఉచితంగా మందులు కూడా ఇస్తున్నామని గోల్కొండ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహజర్‌ఉల్లా అన్నారు. వరల్డ్ ఎయిడ్స్‌డే సందర్భంగా బుధవారం ఏరియా ఆస్పత్రిలో ఆయన ఎయిడ్స్ కౌన్సెలింగ్ సెంటర్‌లో ఎయిడ్స్ పాజిటివ్ సోకిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో ఇప్పటి వరకు 1.33 లక్షల మందికి హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించామన్నారు. వీరిలో 928 మందికి పాజిటివ్ నిర్ధారణ చేయడం జరిగిందని వీరందరికి ఏఆర్‌టీ మందులు ఇస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఐవీ కౌన్సెలర్ దుర్గం దిలీప్‌కుమార్, డాక్టర్ రవికుమార్, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాస్, రుక్సానా తదితరులున్నారు.